క్లుప్తంగా

నాగులాపల్లి పశువైద్యాధికారికి సత్కారం



పశువైద్యాధికారి పద్మజను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని మండల పశువైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని నాగులాపల్లి పశువైద్యాధికారి పద్మజ బదిలీ అయిన సందర్భంగా శనివారం ఆమెను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆరు సంవత్సరాలుగా నాగులాపల్లి రైతులకు పద్మజ మెరుగైన సేవలందించారన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు రెండు పాడి ఆవులు మృతి



మృతి చెందిన పాడి ఆవుల వద్ద రోదిస్తున్న రైతు కళ్యాణం

చీడికాడ: మాడుగుల నుంచి ఖండివరం రహదారిలో మోసూరి వారి కళ్లాలు వద్ద గల జనప రెడ్డి కళ్యాణంకు చెందిన పాడి ఆవులు పిడుగుపాటుకు మృతి చెందాయి. చీడికాడ మండలం ఖండివరం గ్రామానికి చెందిన కళ్యాణం పశువులను మేతకు వదలగా శనివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడి రెండు పాడి ఆవులు పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. బాధిత రైతుకు ఈ పాడి ఆవులే ఆధారం. వీటి ఖరీదు సుమారు రూ.రెండు లక్షలు ఉంటుందని తెలిపారు. బాధిత రైతును చోడవరం సీడీసీ చైర్మన్, జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి సుంకర శ్రీనివాసరావు, స్థానిక ఎంపీటీసీ సభ్యులు గెంజి స్వాతి, బాలాజీ, చీడికాడ మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు మోసూరి సన్నిబాబు పరామర్శించారు. ప్రభుత్వం బాధిత రైతును ఆదుకోవాలని కోరారు.


అనకాపల్లి ఆర్టీసీ డీఎం బదిలీ

అనకాపల్లి: ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ) డిపో మేనేజర్ ఎల్.వెంకటేశ్వరరావు పొన్నూరు డిపోకు బదిలీ అయ్యారు. విజయవాడ ప్రజా రవాణా శాఖ ప్రధాన కార్యాలయంలో సివిల్ ఇంజనీర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై గత నెల 7వ తేదీన అనకాపల్లి డిపో మేనేజర్‌గా వచ్చారు. మళ్లీ నెల రోజులకే బదిలీపై వెళ్లారు.

అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు బదిలీలు...

అనకాపల్లి ఏసీడీఎస్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ జి.కె.లక్ష్మి విశాఖ ఆర్జేడీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. అల్లూరు సీతారామరాజు జిల్లా కొయ్యూరు ఏసీడీఎస్ కార్యాలయంలో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న సునీత అనకాపల్లికి సాధారణ బదిలీపై వచ్చారు. ఈ నెల 31న మరో సూపర్‌వైజర్ నిర్మల పదవీ విరమణ చేయనున్నారని సీడీపీవో కె.ప్రభావతి శనివారం తెలిపారు.

ఉమ్మడి జిల్లా గౌరీ టీచర్స్ కమిటీ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ

అనకాపల్లి: విశాఖ ఉమ్మడి జిల్లా గౌరీ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సూరిశెట్టి సన్యాసి అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక గవరపాలెం పార్కు స్కూల్ ఆవరణలో శనివారం ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా దాడి వెంకటజగ్గప్పారావు, కోశాధికారిగా బి.చంద్రశేఖర్, గౌరవాధ్యక్షుడిగా భీమరశెట్టి కోటేశ్వరరావు, సభ్యులుగా కాండ్రేగుల శంకరబాబు, ఆళ్ల ఓంరాము. కె.ఎం.నాయుడు ఎన్నికయ్యారు. వీరితో అసోసియేషన్ వ్యవస్థాపకుడు కాండ్రేగుల దుర్గాప్రసాద్ రావు ప్రమాణ స్వీకారం చేయించారు. పై కమిటీ ఎన్నిక రెండు సంవత్సరాల పాటు ఉంటుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామికి అలంకరణ



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారు వివిధ అలంకరణలతో దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం స్వామి వారిని వజ్ర కవచాలంకృతులతో పాటు వివిధ రకాల పూలమాలలు, తులసీ మాలలతో అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.





మునగపాక సచివాలయంలో సేవలందిస్తున్న ఉద్యోగులు(ఫైల్)

సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం

- ఉద్యోగుల హేతుబద్ధీకరణ
- వైఎస్సార్‌సీపీ హయాంలో 8 నుంచి 12 మంది సిబ్బంది
- కూటమి పాలనలో 8 మందికే అవకాశం
- ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం
- అయిదేళ్లు సర్వీస్ పూర్తయిన వారికి బదిలీలు

మునగపాక: ప్రభుత్వ సేవలను **ప్రజల ముంగిటకు** తీసుకొస్తూ మాజీ సీఎం వైఎ**స్ జగన్‌మోహన్‌రెడ్డి** ప్రవేశ పెట్టిన సచివాలయ **వ్యవస్థను కూటమి** ప్రభుత్వం నిర్వీర్యం చేస్తో**ంది. అధికారంలోకి** రాగానే వలంటీరు వ్యవస్థను **పక్కన పెట్టేసింది.** ఇప్పుడు సచివాలయ ఉద్యో**గులను కుదించి ప్రజ**లకు గ్రామాల్లోనే సేవలందకు**ండా చేస్తోంది.** పర్యవసానంగా ప్రతి చిన్నపనికీ మండల కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వాట్సాప్‌లో 161 సేవలను తీసుకొచ్చినట్టు ప్రచారం చేసుకున్నా, వాటిని ఎలా వినియోగించుకోవాలో ఇప్పటికీ చాలామందికి తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రామాల్లోనే సేవలు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రజలు, రైతులకు అందుబాటులో ఉండేలా పలు కార్యాలయాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రజలకు సకాలంలో అందించేలా తీసుకువచ్చిన సేవలను నేటికీ మరువలేకున్నారు. వాటిలో ప్రధానంగా సచివాలయ వ్యవస్థ అని చెప్పక తప్పదు. 12 రకాల సేవలు ప్రజలకు దక్కేలా ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. అటువంటి సచివాలయ వ్యవస్థను హేతుబద్ధీకరణలో భాగంగా ఉద్యోగుల సంఖ్యను కూటమి ప్రభుత్వం తగ్గించేందుకు చర్యలు చేపట్టింది.

21 సచివాలయాలు.. 174 మంది ఉద్యోగులు..

మండల వ్యాప్తంగా 21 గ్రామ సచివాలయాలు ఉండగా, వాటిలో 174 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. అయిదు సంవత్సరాల క్రితం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ వ్యవస్థ అందుబాటులోకి వచ్చి గత నెల 31వ తేదీతో అయిదు సంవత్సరాలు పూర్తికావడంతో ఉద్యోగులను తగ్గించేలా ఉత్తర్వులను తీసుకువచ్చింది. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు ప్రజలకు నిస్వార్థమైన సేవలందిస్తూ సకాలంలో సేవలందించేవారు. అటువంటి వ్యవస్థను హేతుబద్ధీకరణ అంటూ ఉద్యోగుల సంఖ్యను తగ్గించేస్తున్నారు. ఒకే సచివాలయంలో అయిదేళ్ల పనిచేసిన ఉద్యోగులకు బదిలీ తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు ఇలా...

కూటమి ప్రభుత్వం గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల హేతుబద్ధీకరణ, బదిలీలను ఒకేసారి చేస్తుంది. ఇప్పటికే ఈ విషయమై కలెక్టర్లకు సూచనలు చేసింది. జనాభా ప్రకారం సచివాలయాలను కొన్ని కేటగిరీలుగా విభజించింది. ఏ- కేటగిరీలో ఆరుగురు, బీ- కేటగిరీలో ఏడుగురు, సీ-కేటగిరీలో 8 మంది ఉద్యోగులను ఉంచేలా నిర్ణయించారు. అదే జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థలో భాగంగా ప్రతీ సచివాలయ పరిధిలో 8 నుంచి 12 మంది వరకు ఉద్యోగులు పనిచేసేవారు. నేడు కూటమి ప్రభుత్వం 6 నుంచి 8 మంది ఉద్యోగులు పనిచేసేలా కుదింపు చేశారు. పంచాయతీ కార్యదర్శి, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్, సర్వేయర్ అసిస్టెంట్, ఆక్సిలరీ నర్సింగ్ మిడ్ వైఫరీ, వెటర్నరీ, ఫిషరీస్ అసిస్టెంట్, మహిళా పోలీసు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చరల్ అండ్ హార్టికల్చర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్ వంటి పోస్టులను అందుబాటులోకి తీసుకొచ్చారు. వారు మెరుగైన సేవలందిస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం క్రమేణా సంబంధిత పోస్టులను క్రమబద్ధీకరించి తగ్గించేందుకు నిర్ణయం తీసుకుంది.

బదిలీల్లో వీరికి ప్రాధాన్యం...

కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులను బదిలీ చేసే క్రమంలో కొంతమందికి ప్రాధాన్యమిచ్చారు. అంధులు, మానసిక దివ్యాంగులైన పిల్లల తల్లిదండ్రులు, 40 శాతం అంగవైకల్యం ఉన్నవారు, క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, న్యూరో సర్జరీ, కిడ్నీ మార్పిడీ చేయించుకున్నవారితో పాటు గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు పైగా పనిచేసిన వారికి ప్రాధాన్యం కల్పిస్తున్నారు. ఒకవేళ భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులైతే వారికి దగ్గర ప్రాంతాలకు బదిలీ చేసేలా కలెక్టర్లకు అధికారాలు ఇస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

నెలాఖరులోగా బదిలీలు..



సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ ఈ నెలాఖరులోగా జరుగుతుంది. అయిదేళ్ల పాటు ఒకేచోట సచివాలయంలో పని చేసే ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిందే. బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 31తో సచివాలయ ఉద్యోగుల గడువు అయిదు సంవత్సరాలు పూర్తి అయింది. ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలి.

– ఎం.ఉషారాణి, ఎంపీడీవో, మునగపాక

‘తల్లికి వందనం’ నగదులో కోతలు వద్దు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో వాగ్దానం చేసినట్లుగా ‘తల్లికి వందనం’ నగదును అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. అడ్డగోలు నిబంధనలతో 9 లక్షల కుటుంబాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఆదాయ పరిమితిని సడలించాలని, గ్రామాల్లో రూ.2.5 లక్షలు, పట్టణాల్లో రూ.3 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలకు తల్లికి వందనం వర్తింపజేయాలన్నారు. ఆదాయంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారందరికీ నగదు వేయాలని కోరారు. ఈ విద్యా సంవత్సరం ఒకటో తరగతి, ఇంటర్‌లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు తల్లికి వందనం ఇవ్వాలన్నారు. స్కీం వర్కర్స్, వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఈ పథకాన్ని వర్తింపచేయాలన్నారు. గత ప్రభుత్వం విధించిన షరతులను నాడు విమర్శించిన కూటమి నేతలు నేడు అంతకుమించిన నిబంధనలు పెట్టి లబ్ధిదారులతోపాటు నగదును తగ్గించడం సరికాదన్నారు. రూ.15 వేలు నేరుగా తల్లులకు చెల్లిస్తామని, ఇప్పుడు రూ.2 వేలు మినహాయించడం ఏమిటని ప్రశ్నించారు. ఇంత వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎవరికీ ఇవ్వకుండానే ఆ పేరుతో ఈ పథకం మినహాయించడం అన్యాయమన్నారు. విద్యా హక్కు చట్టం కింద ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్న వారి తల్లులకు కాకుండా నేరుగా స్కూళ్ల మేనేజ్‌మెంట్‌ల ఖాతాలకు చెల్లించడం ప్రభుత్వ విద్యను దెబ్బతీయడమేన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించి అర్హులందరికీ ఈ పథకం అమలు చేయాలని కోరారు.

గుర్తింపు లేని ప్రైవేటు కళాశాలలపై చర్యలకు డిమాండ్

సబ్బవరం: పుట్టగొడుగుల్లా వెలుస్తున్న గుర్తింపు లేని ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు జూనియర్ కళాశాలల జాయింట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె. జనార్దన్ కోరారు. సబ్బవరంలోని 4ఎస్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల ఎటువంటి ప్రభుత్వ గుర్తింపు లేకుండా కాలేజీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి కళాశాలల్లో తమ పిల్లలను చేర్పించి వారి భవిష్యత్‌ను రోడ్డున పడేయొద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సబ్బవరంలో ఒక కళాశాల ఇంటర్‌లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోవాలని అనకాపల్లి కలెక్టర్‌తో పాటు ఇంటర్ బోర్డ్ కమిషనర్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశామని, డీఐఈవో దృష్టికి తీసుకెళ్లడంతో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ కె. నాగేశ్వరరావు, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఎ. శేషగిరిరావు, బీశెట్టి మురళీప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్. కృష్ణమోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు టి. మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో పాముల బెడద

ఆవాసంగా మారిన పిచ్చిమొక్కలు



ధర్మవరం అగ్రహారంలో వీధుల్లో పేరుకుపోయిన పిచ్చితుప్పలు



తిమ్మాపురం వీధుల్లో పిచ్చితుప్పలు



ఖాళీ ప్రదేశాల్లో పొదలు

ఎస్.రాయవరం: ధర్మవరం అగ్రహారం గ్రామ వీధుల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయి పాములకు ఆవాసంగా మారాయి. కొన్నేళ్లుగా ఇదే సమస్యతో రేషన్ డిపో వీధిలో ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ వాసులు పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిమ్మాపురంలో శరణ్య వేంకటేశ్వర స్వామి కాలనీ, కొరుప్రోలు వైఎస్సార్ కాలనీ, పెద ఉప్పలం ఎస్సీ కాలనీ, దార్లపూడి రెల్లి కాలనీ, చెల్లాపురం, చినగుమ్ములూరు ఎస్సీ కాలనీ, రామయ్యపట్నం, పెట్టుగొళ్లపల్లి, పెదగుమ్ములూరు, ఎస్.రాయవరం రెల్లి కాలనీ, దళితకాలనీ, సర్వసిద్ధి ఎస్సీ కాలనీ, సైతారుపేట, ఉప్పరాపల్లి, వాకపాడు, కాపుల వాతాత తదితర గ్రామాల్లోని వీధుల్లో పిచ్చిమొక్కల వల్ల పాములు బెడద నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాలకు తుప్పలు మరింత పెరిగి పాములకు ఆవాసాలుగా మారుతున్నాయి. పాముకాటుకు గతంలో కొంత మంది మృతి చెందగా, మరి కొందరు అస్వస్థతకు గురై ఇబ్బందులు పడ్డారు. పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు పిచ్చితుప్పలు తొలగించే చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇళ్లలోకి పాములు వస్తున్నాయి



మా వీధిలో పెరిగిన పిచ్చిమొక్కలు, పాడుబడ్డ ఇళ్లు, ఖాళీ స్థలాల్లో పెరిగిన తుప్పలు వల్ల ఇళ్లలోకి పాములు వస్తున్నాయి. ఈ సమస్యను పలుమార్లు పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదు. ఇటీవల వర్షాలకు పెరిగిన తుప్పలతో మరింత ఇబ్బందికరంగా మారింది.

– వై. నాగమణి, ధర్మవరం అగ్రహారం

గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్



గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. పిచ్చిమొక్కలు తొలగింపుపై చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో పర్యటించి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– ఎస్.సత్యనారాయణ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో, ఎస్.రాయవరం

సాగునీటి కాలువల అభివృద్ధికి చర్యలు



కాలువలో సిల్టు తొలగింపు పనులు పరిశీలిస్తున్న రాము, శ్రీరామమూర్తి తదితరులు

మునగపాక: సాగునీటి కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు మునగపాక కృష్ణంరాజు కాలువ చైర్మన్ పెంటకోట రాము, వైస్ చైర్మన్ పెంటకోట శ్రీరామమూర్తి తెలిపారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదేశాల మేరకు నీటిపారుదల శాఖ అధికారుల పర్యవేక్షణలో మండలంలోని పలు కాలువల అభివృద్ధితోపాటు సిల్టు తొలగింపు పనులు జరుగుతున్నాయన్నారు. శనివారం మునగపాక బీసీ కాలనీ ఎదురుగా కృష్ణంరాజు కాలువలో పనులను పరిశీలించారు. సీజన్‌లో సాగునీటి ఇబ్బందులు లేకుండా కాలువలను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ఎగువ నుంచి వచ్చే నీరు దిగువ పొలాలక అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ డైరెక్టర్ నరసింగరావు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: మండలంలోని గణపర్తిలో అభయాం**జనేయ స్వామి ఆలయ** వార్షికోత్సవం శనివారం **ఘనంగా నిర్వహించారు.** స్వామివారి విగ్రహ **ప్రతిష్ఠ చేసి 33 సంవత్స**రాలు పూర్తయిన సందర్భం**గా ఉదయం నుంచి భక్తు**లు పెద్దసంఖ్యలో తరలి**వచ్చి దర్శించుకున్నారు.** మధ్యాహ్నం ఆలయ **ప్రాంగణంలో అన్నసమా**రాధన ఏర్పాటు చేశారు. **వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్య**దర్శి బొడ్డేడ ప్రసాద్ పూజ**లు చేశారు. సమరసత** ఫౌండేషన్ ప్రతినిధి గిన్నె **వీర మహేశ్వరరావు,** సర్పంచ్ చదరం నాయుడు, **పిన్నమరాజు రవీంద్రరా**జు, రామ నాగేశ్వర రావు, కొండారావు, యల్లపు అప్పారావు, భీంపల్లి శ్రీనివాసరావు, పొనమళ్ల శ్రీను, చదరం జగదీష్, పెంటకోట నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతను ఉపేక్షిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య

పరవాడ: ఫార్మాసిటీపరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను నిర్లక్ష్యం చేస్తే సహించబోమని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య పరిశ్రమల యాజమాన్యాలను హెచ్చరించారు. గొర్లివానిపాలెం లారల్ రీజినల్ కార్యాలయంలో పరిశ్రమ యాజమాన్యాలతో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ప్రసంగించారు. కార్మికుల భద్రత కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్మికుల భద్రతకు అవసరమైన సామగ్రిని వారికి సమకూర్చడానికి యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణకు పరిశ్రమల్లో పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. క్రమం తప్పకుండా పరిశ్రమల్లో ఆడిట్లు, మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు. భద్రత ప్రోటోకాల్‌పై కార్మికులకు శిక్షణ కల్పించాలన్నారు. పరిశ్రమల ప్రాంగణాల్లో ఉద్యోగులు, కార్మికులు రక్షణ పరికరాలు విధిగా ధరించాలన్నారు. ప్రమాదకర కార్యకలాపాలను అర్హత కలిగిన సాంకేతిక సిబ్బంది పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలో భద్రతా చర్యలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా విజిలెన్స్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని కృష్ణయ్య తెలిపారు. జేఎన్‌పీసీ మేనేజ్‌మెంట్ కార్మికుల భద్రత కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలను మేనేజ్‌మెంట్ ప్రతినిధి జె.సుబ్బారావు వివరించారు. ఈ సమావేశంలో అనకాపల్లి జిల్లా అగ్నిమాపక శాఖ, బ్రాయిలర్, జిల్లా పరిశ్రమల శాఖలు, జేఎన్‌పీసీ పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



బి.కె.పల్లిలో యోగా చేస్తున్న అధికారులు, స్థానికులు



పాయకరావుపేటలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది



యోగా సాధన చేస్తున్న సచివాలయ ఉద్యోగులు



శ్రీరాంపురంలో యోగా నిర్వహిస్తున్న సిబ్బంది



అచ్యుతాపురంలో యోగా చేస్తున్న సర్పంచ్ విమలా నాయుడు, అధికారులు, శిక్షకులు

కోటవురట్ల: యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. బి.కె.పల్లిలో యోగాంధ్ర డెమోన్‌స్ట్రేషన్ కర్టెన్‌రైజర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. యోగా ట్రైనర్ శ్యాం ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. స్థానికులు ఉత్సాహంగా పాల్గొని యోగా చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరూ ఏదొక అనారోగ్య సమస్యతో బాధపడుతున్నవారే అన్నారు. పూర్తిగా శరీరానికి శ్రమ ఇవ్వకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు. యోగాతో వాటన్నింటినీ దూరం పెట్టవచ్చని, సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు తిరుమలబాబు, ఈవోపీఆర్డీ రఘురాం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్రపై అవగాహన

పాయకరావుపేట: మండలంలో యోగాంధ్రపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని ఎంపీడీవో జయప్రకాష్‌రావు తెలిపారు. పాయకరావుపేట, శ్రీరాంపురం తదితర గ్రామాల్లో గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా, ఆరోగ్య శాఖ సిబ్బంది యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ వర్మ, పాయకరావుపేట గ్రామ పంచాయతీ ఈవో లోవరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మునగపాక: మండలంలోని పలు సచివాలయాల్లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ నెల 21న విశాఖలో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కొద్ది రోజులుగా యోగా సాధన నిర్వహిస్తున్నారు. ప్రతి సచివాలయంలో ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు యోగా చేస్తున్నారు. యోగా ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని ఈవో ఆర్డీ సోమరాజు తెలిపారు.

అచ్యుతాపురం రూరల్: రోజూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సర్పంచ్ కూండ్రపు విమలానాయుడు తెలిపారు. శనివారం అచ్యుతాపురం పంచాయతీ కార్యాలయం ఆవరణలో మండల అధికారులు, గ్రామస్తులు యోగాసనాలు చేశారు. అనారోగ్యాలకు గురవ్వకుండా ఉండాలంటే వ్యాయామం అత్యావశ్యకమని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లేశ్వరరావు, ఈవోపీఆర్డీ శ్రీరామమూర్తి నాయుడు, పంచాయతీ సెక్రటరీ శైలజ, కోచ్ వెంకట్, యోగా శిక్షకులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కండి



రక్తదాన శిబిరంలో దాతలు

అచ్యుతాపురం రూరల్: రక్తదానంతో ప్రాణదాతలు కావాలని స్వామీ వివేకానంద స్వచ్ఛంద సంస్థ సేవా సంఘం అధ్యక్షుడు చోడిపల్లి అప్పారావు తెలిపారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా మండలంలో పలు చోట్ల రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. హరిపాలెంలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో అనకాపల్లి ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో 25 మంది నుంచి రక్తం సేకరించారు. అదే గ్రామానికి చెందిన కాండ్రేగుల వెంకట అప్పారావు నేటితో కలిపి 29 సార్లు రక్తదానం చేశారు. చోడిపల్లి అప్పారావు ఇప్పటికి 45 సార్లు రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఇదివరలో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. కార్య క్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, సర్పంచ్ మారిశెట్టి లక్ష్మిసూర్యనారాయణ, రామారావు, పట్నాయక్ పాల్గొన్నారు.